

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వసతిగృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఐసిడిఎస్ పరిధిలోని బాలసదనం, శిశుగృహ, స్త్రీ సదనం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్, అనురాగ నిలయాలను గురువారం సందర్శించారు. అక్కడ అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. వసతిగృహాల్లో ఉండే పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై ఉద్యోగుల గుర్రు

- గ్రీవెన్స్, ఇతర సమావేశాల్లో అధికారులపై అరుపులు, కేకలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఒక ఎంపిడిఒను నిల్చోబెట్టి అవమానం
- సాధారణ సందర్భాలతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని వైనం
- కార్యాచరణకు సిద్ధమవుతున్న ఎన్‌జిఒ, రెవెన్యూ అసోసియేషన్





జిల్లా పాలనా యంత్రాంగాన్ని నడిపించే విషయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులను కలుపుకొనిపోయి వారితో కలిసి పనిచేయడంలో సమన్వయం కొరవడుతోంది. పనిఒత్తిడి రీత్యా కలెక్టర్‌లో సహజంగా ఉండే కోపం, అసహనం ఆయనకు, ఉద్యోగులకు మరింత గ్యాప్ పెంచుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 'మీకోసం', ఇతర సమావేశాల్లో తమపై కలెక్టర్ వ్యవహరిస్తున్న తీరుపై అధికారులు, ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమను తోటి అధికారుల ముందు అవమానించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కలెక్టర్ తీరుపై చర్చించి, కార్యాచరణను రూపొందించేందుకు ఎపి ఎన్‌జిఒ, రెవెన్యూ అసోసియేషన్ ఈనెల 24న విడివిడిగా సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఐఎఎస్‌ల బదిలీల్లో భాగంగా జూలై ఐదో తేదీన కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లాకు వచ్చారు. అంతకుముందు ఆయన చిత్తూరు, నూజివీడు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. విశాఖపట్నం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. నెల్లూరు, విజయవాడ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్‌గా పనిచేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌పై గట్టి పట్టు సాధించిన ఆయన ఇతర ప్రభుత్వశాఖల దగ్గరకొచ్చేసరికి అంత అవగాహన లేదనే చర్చ అధికారుల్లో నడుస్తోంది. రెవెన్యూశాఖ చూడాల్సిన విధులను వైద్యారోగ్యశాఖకు, ఆ శాఖ చూడాల్సిన బాధ్యతలను రెవెన్యూశాఖ అప్పగిస్తున్నట్లు ఉద్యోగులు బహిరంగంగానే అనుకుంటున్నారు. ప్రభుత్వ శాఖలపై సమీక్షల సందర్భంగా అధికారులు, ఉద్యోగులపై అసహనంతో విరుచుకుపడుతున్నట్లు చెప్తున్నారు. అనుభవ రాహిత్యం పలు అంశాల్లో ప్రస్ఫుటమవుతోంది. ఒడిశా నుంచి ఫేక్ బిల్లులతో ఇసుకను రవాణా చేస్తున్నారని మీడియా సమావేశంలో విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఒడిశా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఫేక్ బిల్లులను వారికి చూపించి సరైనవో, కావో తేలుస్తామంటూ చెప్పడంతో అంతా అవాక్కయ్యారు. ఆగస్టు 28న నిర్వహించిన జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ఎరువుల కొరత, కరకట్టల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు వంటి అంశాలపై సభ్యులు లేవనెత్తిన అంశాలను చివరి వరకు నోట్‌బుక్‌లో రాస్తూనే కనిపించారు తప్ప వాటికి బదులివ్వలేదు.

సోమవారం వచ్చిదంటే అధికారుల గుండెల్లో రైళ్లు

సోమవారం వచ్చిందంటే చాలు అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మీకోసం (గ్రీవెన్స్)లో ఎవరిపై ఎలా విరుచుకుపడతారోనన్న భయం అధికారులను వెంటాడుతోంది. జెడ్‌పిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో అర్జీ రీ ఓపెన్ అయితే చాలు పెద్ద కేకలతో విరుచుకుపడుతుండడం చాలాసార్లు తటస్థించింది. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రీవెన్స్‌లో తీసుకొచ్చిన టీ బ్రేక్ పద్ధతి అధికారులకు ఇబ్బందిగా మారింది. టీ బ్రేక్‌కు అరగంట నుంచి 45 నిమిషాలు సమయం వృథా కావడంతో గ్రీవెన్స్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మూడు గంటల వరకు సాగుతోంది. అధికారుల్లో అధికశాతం మంది బిపి, సుగర్‌లతో బాధపడుతుండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గంటల కొద్దీ అధికారుల పడిగాపులు

ఫైళ్ల క్లియరెన్స్ కోసం కలెక్టరేట్‌కు వచ్చే అధికారులు కలెక్టర్ తీరుతో చుక్కలు చూస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకు పిలిచి రాత్రి పది, 11 గంటల వరకు ఉంచుతున్నట్లు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు వెళ్లిన అధికారులు మధ్యాహ్నం మూడు గంటల వరకు నిరీక్షిస్తున్న పరిస్థితి నెలకొంది. బిపి, సుగర్ ఉన్న అధికారులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు నెలల కిందట కలెక్టరేట్‌కు రావాలంటూ ఎంపిడిఒలను పిలిచి, ఆయన టెక్కలి వెళ్లిపోయారు. టెక్కలిలో కలవడానికి వెళ్తే, ఆయన శ్రీకాకుళం వచ్చేశారు. మరోవైపు కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. పనిదినాల్లో రాత్రి పది గంటల వరకు ఉంచడంతో పాటు సెలవు దినాల్లో పనిచేయిస్తున్నారనే కోపం వారిలో గూడు కట్టుకుంది.

సందర్శకులకూ నిరాశే

కలెక్టరేట్‌కు నిత్యం పదుల సంఖ్యలో జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు వినతులతో వస్తుంటారు. సాధారణంగా కలెక్టర్ ఛాంబరు వద్ద వెయిటింగ్ హాల్‌లో వారిని కూర్చోబెట్టి ఒక్కొక్కరినీ పిలిచి వారి సమస్యను అడిగి తెలుసుకునే పరిస్థితి గతంలో ఉండేది. ఆ సమస్యపై సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడటమో, ఆ వినతిపత్రంపై సంతకం చేసి పిఎస్ ద్వారా పంపడమో గత కలెక్టర్లు చేసేవారు. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వచ్చిన తర్వాత ఛాంబరు బయటే వారి వినతులు తీసుకుని పంపేస్తున్న పరిస్థితి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి చాలా వ్యయ ప్రయాసలకోర్చి వస్తున్న సందర్శకులు, తమ సమస్యను కలెక్టర్‌కు పూర్తిగా చెప్పుకోలేకపోయామనే నిరాశతోనే వారు వెనుదిరుగుతున్నారు.

అధికారులకు అవమానం

సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్ సమావేశాల్లో అధికారులను అవమానించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ధాన్యం కొనుగోలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా సోంపేట ఎంపిడిఒను ఏకంగా నిల్చోబెట్టి అవమానించినట్లు తెలిసింది. దీనిపై ఎంపిడిఒలు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సిపిఒ కార్యాలయంలో ఓ అధికారి తనకు చెప్పకుండా సెలవు పెట్టి వెళ్లినందుకు ఆ మరుసటి రోజు మధ్యాహ్నం మూడు గంటలకు పిలిచి రాత్రి 12 గంటల వరకు కలెక్టరేట్‌లో ఉంచినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల ఒకటో తేదీన సిఎం చంద్రబాబు జెడ్‌పిలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిపిఒ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు వీడియో, ఆడియో క్లిప్పింగ్‌లను తెప్పించుకోలేకపోయారంటూ వారిని చెడామడా తిట్టినట్లు తెలిసింది. ఇతర అన్ని ప్రభుత్వశాఖల అధికారులకూ నిత్యం ఇదే అనుభవం ఎదురవుతోంది. తమకు అప్పగించిన పని గానీ ఫైల్ గానీ తయారు చేయడంలో తప్పు చేస్తే, సరిదిద్దాలే తప్ప కోపం అరిస్తే ఏం ప్రయోజనమని అధికారులు, ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - హిరమండలం, సారవకోట, జలుమూరు

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. హిరమండలం, సారవకోట, జలుమూరు పోలీస్‌స్టేషన్లను గురువారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ల ఆవరణ, రిసెప్షన్, లాకప్, కంప్యూటర్, రైటర్ గదులను పరిశీలించారు. పలురకాల రికార్డులను పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ గ్రామాల్లో సందర్శించి మహిళలపై జరుగుతున్న దాడులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచార సేకరించి సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలని మహిళా పోలీసులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం, మాదక ద్రవ్యాల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత, కొత్త నేరస్తులపై నిఘా ఉంచాలని.. మహిళలు, చిన్న పిల్లలపై నేరాలను కట్టడి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దొంగతనాలు, ప్రాపర్టీ నేరాల దర్యాప్తు పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని, ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహశీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికకు వచ్చే అర్జీల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, లోకాయుక్త, కోర్టు కేసులు, వాటర్ ట్యాక్స్, నాలా, రీ సర్వే, ఆర్ఒఆర్, సివిల్ సప్లయ్స్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా భూముల రీ సర్వేలో లోపాలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. నీటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పన్ను వసూలుకు సిబ్బంది అవసరం ఉంటే డిజిటల్ అసిస్టెంట్‌ను ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తెలియ జేయాలన్నారు. తహశీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్తే సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించవచ్చన్నారు. ఉచిత ఇసుకపై సమస్యలు ఉంటే తక్షణమే ఆపాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక తీయడానికి అవకాశం లేదని విఆర్ఒకు తెలియజేయాలని, వాటర్ సోర్సెస్ దగ్గర, వంతెనల వద్ద, రాత్రి పూట తీయకూడదన్నారు. ఎన్‌జిటి నిబంధనలు అతిక్రమించకూడదన్నారు. గార, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో సీజ్ చేసిన ఇసుక ఉన్నట్లు తహశీల్దార్లు తెలిపారు. మరమ్మతులు ఉన్న తహశీల్దార్ కార్యాలయాల అంచనా వ్యయం పంపాలని కలెక్టర్ సూచించారు. ఈ-ఆఫీస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షలు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

36 జిఒను అమలు చేయాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు జిఒ నంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధ్యక్షులు రాణా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త రాయబారం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిష్ యాక్టు-1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలన్నారు. పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు సకాలంలో అందించాలని, వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై నెట్టివేసే ధోరణి మానుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం నుంచి వాహనాల మరమ్మతులు చేపట్టాలన్నారు. చట్టబద్ధమైన వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. గత సమ్మె కాల ఒప్పందాల్లో భాగమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ పదేళ్ల సర్వీస్ ఉన్న వారికి రూ.75 వేలు, పదేళ్ల కంటే అదనపు సర్వీస్ ఉన్న వారికి ఏడాదికి రూ.రెండు వేలు అదనంగా ఇవ్వాలన్నారు. ప్రమాద మృతులకు రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల ఎక్స్‌గ్రేషియా పెంచాలన్నారు. దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతూ ఇచ్చిన జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. నగర పరిధిలోని ఖాజీపేట పంపు హౌస్ శ్లాబ్ తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని, లేని పక్షంలో అక్కడ ఎలాంటి ప్రమాదం సంభవించినా కార్పొరేషన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. రిటైర్మెంట్, చనిపోయిన, అనారోగ్య కారణంగా కార్మికులకు పెన్షన్, గ్రాట్యూటీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇంజినీరింగ్ విభాగం నాయకులు పి.త్రినాథరావు, పి.మణికంఠ, ఆర్.గిరిజాశంకర్, బి.వెంకటరమణ, కె.ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రణాళికాబద్ధంగా జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, ప్రగతిపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా జిల్లాలో వంద రోజుల వ్యవధిలో ఐదు వేల గృహాలు, ఏడాదిలోపు 35 వేల ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి రూఫ్ లెవల్ పూర్తయిన భవనాలను వంద పూర్తి చేయాలన్నారు.

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు రుణాలు ఇప్పించి వాటిని నిర్మాణాల కోసం వినియోగించుకునేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ ద్వారా గృహ లబ్ధిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించి వేతన లబ్ధి చేకూర్చాలన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ బి.నగేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇళ్ల పురోగతిని వివరించారు. సమీక్షలో డ్వామా పీడీ సుధాకరరావు, గృహనిర్మాణ శాఖ ఇఇలు, డిఇఇ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాల క్లయిమ్‌ల పరిష్కారం

ఎపిజిఎల్‌ఐ సంచాలకులు రెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సకాలంలో రుణాల క్లయిమ్‌ల పరిష్కారానికి చొరవ చూపాలని ఎపిజిఎల్‌ఐ రాష్ట్ర సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని ఎపిజిఎల్‌ఐ కార్యాలయంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుకు సంబంధించి ఎఫ్ఆర్ఎస్, హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిఎల్‌ఐలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు సకాలంలో సేవలందించడం, సంతృప్తికరమైన సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ఎపిజిఎల్‌ఐ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎపిజిఎల్‌ఐ రుణాలు, క్లయిమ్‌ల పరిష్కారంలో చొరవ చూపించాలన్నారు. పాలసీలకు సంబంధించి ఎవరికైనా అనుమానాలుంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. ఎపిజిఎల్‌ఐ పాలసీ పెంచుకునే వెసులుబాటు కల్పించిన విషయాన్ని అవగాహన కల్పించాలన్నారు. ఎపిజిఎల్‌ఐకి సంబంధించిన పాలసీ, లోన్ క్లయిమ్ సేవలు ఆన్‌లైన్ నిధి పోర్టల్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. నామినీ వివరాలు అప్‌డేషన్ పాలసీదారులకు అప్‌డేట్ చేసేందుకు నిధి యాప్‌లో సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఇకపై ఎటువంటి ఫిజికల్ దరఖాస్తులను అంగీకరించబోమని స్పష్టం చేశారు. కార్యాలయ ఉద్యోగులు ఆయన్ను శాలువ కప్పి సత్కరించారు. తొలుత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ సంచాలకులు ఎ.ఆర్.కె నాయుడు, శ్రీకాకుళం సహాయ సంచాలకులు ఎస్.సతీష్ కుమార్, పర్యవేక్షకులు ఎస్.ఎం సుభని, జి.అనురాధ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఎయిర్‌పోర్టుకు స్థల అన్వేషణ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు మలకేత్ సింగ్ ఆధ్వర్యాన ఆరుగురు సభ్యులు వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో గురువారం అన్వేషించారు. ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన స్థాయిలోనే ప్రక్రియ కొనసాగుతోందని పలాస ఆర్‌డిఒ వి.వెంకటేష్ తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలంలోని మెట్టూరు పంచాయతీ పరిధిలో 207.48 ఎకరాలు, చీపురుపల్లి పంచాయతీ పరిధిలో 127.57 ఎకరాలను ఇప్పటికే గుర్తించామన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 1389.7 ఎకరాల ఎయిర్ పోర్టుకు మొత్తం 1883.71 ఎకరాల విస్తీర్ణం అవసరం కాగా, ఈ ప్రాంతంలో 285.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. మిగతా 1088.58 ఎకరాలను రైతుల నుంచి సేకరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు సర్వే నిర్వహించి భూ సేకరణకు అవసరమైన ప్రక్రియ ప్రారంభించాలని కేంద్ర బృందం సభ్యులు దిశానిర్దేశం చేశారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సీతారామయ్య, హైమావతి, డిటి రామకృష్ణ, సర్వేయర్ తిరుపతి, బాబూరావు, ఎపిటిసిసి చైర్మన్ వజ్జ బాబూరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, అబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, పొట్టి మోహన్ పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మలకేత్ సింగ్

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత్స్యకారుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పలు పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అత్యంత విశాలమైన సముద్రతీరం ఉందని, తీరంలో మత్స్యకారుల వేట సాగక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారని గుర్తుచేశారు. వలసల నివారణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఆశించిన రీతిలో ఫలితాలు సాధించలేకపోయాయన్నారు. మత్స్యకారుల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తున్నాయన్నారు. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మత్స్యకారుల పిల్లలకు చదువుతో పాటు క్రీడా రంగంలో విశేష ప్రతిభ చూపేందుకు వీలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు కె.లక్ష్మణ్ కుమార్, పుచ్చ ఈశ్వరరావు, మత్స్యకార సహకార సంఘం మాజీ అధ్యక్షులు మైలపల్లి నరసింగరావు, మాజీ డైరెక్టర్ మైలపల్లి త్రినాథరావు, టిడిపి నాయకులు డిజిఎం ఆనందరావు, దుమ్ము అశోక్, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మరిన్ని వార్తల కోసం epaper.prajasakti.com



ఎంపికైన రగ్బీ జిల్లా జట్టు

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

నెల్లూరు జిల్లా కావలిలో డిసెంబరు 1,2 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బాలురు, బాలికల నుంచి రెండు బృందాలకు 24 మంది క్రీడాకారులను గురువారం ఎంపిక చేశామన్నారు. క్రీడాకారుల ప్రయాణపు ఖర్చుల విరాళం జిల్లా అధ్యక్షులు దొంకాన కృష్ణారావు అందజేశారని పేర్కొన్నారు. జిల్లా భాగీరథి రాష్ట్ర స్థాయిలో చాటేందుకు క్రీడాకారుల కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్థసారథి, కళాశాల పీడీ సత్యనారాయణ వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గయ్య, రాజు, కాపల రఘునాథరావు, ఆదిశేషు, భారతి, ప్రమీల, పి.జగదీష్ పాల్గొన్నారు.



జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు

సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు పయనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిత్తూరు జిల్లా అరవ కొండ వేదికగా నేటి నుంచి జగరనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో అండర్-14 సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు గురువారం బయలుదేరి వెళ్లారు. వారికి డిఇఒ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య వీడ్కోలు తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు 68వ ఎపి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు జరగనున్నాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ బివి రమణ మాట్లాడుతూ గత పదేళ్లుగా జిల్లాలో సాఫ్ట్ బాల్ నుంచి వంద మంది రాష్ట్రస్థాయిలో, 70 మందికిపైగా జాతీయస్థాయిలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ఎంతో శుభ పరిణామమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రస్తుత జట్టు విజేతలుగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పీడీ, పిఇటి సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, సీనియర్ పీడీ మెట్ట తిరుపతిరావు, క్రీడాకారుల తల్లిదండ్రులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లుగా తోటారావు, సీనియర్ నేషనల్ ప్లేయర్లు, కోచ్‌లు ఐ.గౌరీశంకర్, పి.హరికృష్ణ క్రీడాకారులతో వెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక సబ్ స్టేషన్ మాణిక్యపురం ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బి.జి.పుట్టుగ, మాణిక్యపురం, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పైడిభీమవరంలో ధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాల్లో మార్పు లేదన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టేది రైతాంగమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత పదేళ్లలో కేంద్రంలో బిజెపి కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్నురాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా భారీపరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. కార్మికులకు నెలకు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇవ్వాల్సిన రూ.26 వేల కనీస వేతనాన్ని ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన స్కీం కార్మికులను 'కార్మికులుగా' గుర్తించడం లేదని, కార్మికులు ఎంత కాలం పనిచేసినా పర్మినెంట్ చేయడం లేదన్నారు. కార్మికులు తిరగబడతారని 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం మార్చిందన్నారు. కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.అచ్చెన్నాయుడు, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తత్వశాస్త్రంతో అన్ని శాస్త్రాలపై అవగాహన

బిఆర్‌ఎయు విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

తత్వశాస్త్రం అనేక అధ్యయన రంగాలకు మూలశాస్త్రమని, దీనిపై పట్టు సాధించడం ద్వారా సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పడుతుందని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన 'ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మానవ విలువలు, సామాజిక నైతికత దిగజారుతున్నప్పుడు తత్వశాస్త్రం అవసరం కనిపిస్తుందన్నారు. సోక్రటీస్, ప్లాటో,



మాట్లాడుతున్న విసి రజని

అరిస్టాటిల్ వంటి తాత్విక మేధావులు భవిష్యత్ ప్రపంచానికి అవసరమైన ఆచరణ సిద్ధాంతాలు, సామాజిక విద్య సంబంధిత విలువలు శతాబ్దాల క్రితమే తెలియజేశారన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు మెరుగైన సౌకర్యాలను అందిస్తాయని, ఫిలాసఫీ వంటి సామాజిక శాస్త్రాలు సమాజంలోని అంతరాలను తొలగించేందుకు ఉపయోగపడతాయన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య బి. అడ్డయ్య, ప్రత్యేకాధికారి డా. కె.స్వామ్యలక్ష్మి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.ఉదయ భాస్కర్, డా. ఎం.అనూరాధ, డా. సిహెచ్ రాజశేఖర రావు, ఒ.ఎస్‌డి డా. యు.కావ్య జ్యోత్స్న, అధ్యాపకులు డా.పి.రవికుమార్, డా.కె.ఉదయ కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి- పాతపట్నం



వినతిపత్రం అందజేస్తున్న ఎంజిఆర్

పాతపట్నం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. సచివాలయంలో సిఎం నారా చంద్రబాబును గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలసలను అరికట్టేందుకు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. నియోజవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువగా గిరిజనులు ఉన్న నియోజకవర్గంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఒడిశా రాష్ట్రంపై అధారపడాల్సి వస్తుందని, అందుకు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై సిఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

డయాలసిస్ యూనిట్లు పెంచాలి

ఎమ్మెల్సీ రామారావు

కవిటి: నియోజకవర్గంలోని కిడ్నీ సమస్యలపై దృష్టిసారించి డయాలసిస్ యూనిట్లు పెంచాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు గురువారం శాసన మండలిలో మాట్లాడారు. గత ప్రభుత్వం కిడ్నీ రోగులకు చేసిన సేవలు వివరిస్తూ కొనసాగింపుగా ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రోజురోజుకీ డయాలసిస్ అవసరమైన రోగుల సంఖ్య పెరుగుతోందని, డయాలసిస్ యూనిట్లలో వెయిటింగ్ లిస్టు పెరిగిపోతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఒక్కో డయాలసిస్ సెంటర్లో, ఒక బెడ్ మీద ఒక రోగికి బదులు ముగ్గురు రోగులు ఉంటున్న పరిస్థితి ఉందన్నారు. రోగుల సంఖ్యకు సరిపడే విధంగా బెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సిక్కోలు విద్యార్థినులకు 'ఉమెన్ ఇన్ ఏవియేషన్' పురస్కారాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉమ్లున్మాంగ్ ఉల్నామ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 18న నిర్వహించిన ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా వ్యాసరచన పోటీలో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. పలు డిగ్రీ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థినులు హాజరు కాగా, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన వై.అఖిల, యేల్తూరి జ్యోత్స్న, శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఆరిక అనిత, జె.గంగోత్రి, పి.నాగమణి, పి.సుశీలను ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 20న ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అక్కడి ఏరో సిటీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా అధ్యక్షులు రాధా భాటియా, ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విమానయాన శాఖ కార్యదర్శి మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది విద్యార్థినులు విజేతలుగా నిలవగా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే ఆరుగురు ఉండడం అభినందనీయమన్నారు. విమానయాన రంగంలో మహిళలను మరింతగా ప్రోత్సహించాలనే కేంద్రమంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షలకు ఇదే నిదర్శనమన్నారు.

బాలికల కలలకు రెక్కలిద్దాం

జిల్లాకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడంపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వీడియో సందేశం విడుదల చేశారు. బహుమతులు పొందిన విద్యార్థినులకు అభినందనలు తెలియజేశారు. ఉన్నతంగా రాణించాలనే బాలికల కలలకు రెక్కలిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి అమ్మాయినీ ఉన్నత చదువులు చదివించాలని, తమదైన ఆసక్తి కలిగిన రంగంలో వారిని ప్రోత్సహించాలని కోరారు. భేటీ కా ఉడాన్.. దేశ్ కా స్వాభిమాన్ లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అరుదైన అవకాశం దక్కించుకున్న విద్యార్థినులను ఆయా కళాశాలకు చెందిన ప్రిన్సిపాళ్లు, సిబ్బంది అభినందించారు.

ఈసారికి తెలుగు మాధ్యమమే

ప్రజాశక్తి- టెక్కలి

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఏ మాధ్యమంలోనైనా రాయాలనే అనే దానిపై ప్రభుత్వ విద్యాశాఖ ఇటీవల స్పష్టత నిచ్చింది. దీంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తం కాగా, పదో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయుల్లో నెలకున్న సందేహాలకు సమాధానం దొరికింది. పదో తరగతి విద్యా సంవత్సరం నుంచి తలెత్తిన మాధ్యమం సందేహానికి ఎట్టకేలకు స్పష్టతనిస్తూ... విద్యాశాఖాధికారులు విద్యార్థులు తమకు నచ్చిన మాధ్యమంలోనే పరీక్షలు రాయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు ఉంటాయనే సందేహాన్నీ ఉపాధ్యాయులకు, విద్యార్థులు స్పష్టత నివ్వడం విశేషం. దీంతో పరీక్షల ఫీజు చెల్లింపుల్లో మాధ్యమం ఎంచుకునే దానిపై స్పష్టత లభించడంతో ప్రధానోపాధ్యాయులకు మార్గం సుగమనం అవుతుంది.



కుమారి బిశాయి మృతదేహం
(ఇన్‌సెట్‌లో కుమారి బిశాయి ఫైల్)

కిడ్నీ వ్యాధితో బాలిక మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస కిడ్నీ ఆస్పత్రిలో కుమారి బిశాయి (14) డయాలసిస్ చేయించుకుంటూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... కంచిలి మండలం తలతంపరకు చెందిన రామ బసై, కమల బిసైల కుమార్తె కుమారి నాలుగు నెలలు క్రితం అనారోగ్యానికి గురైంది. ముందుగా పలాస ప్రయివేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా, కిడ్నీ బారిన పడినట్టు గుర్తించారు. అప్పటి నుంచి సోంపేట కిడ్నీ ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటుంది. బుధవారం బిపి ఎక్కువ కావడంతో పలాస కిడ్నీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. మృతుడికి అన్నయ్య ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కవిటి మండలం మాణిక్యపురం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది.



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటలు

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని అప్పోజిపేట, మర్రిపాడు గ్రామాల్లో టెక్కలి, కోటబొమ్మాళి నరసన్నపేట, ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా ఊటలపై గురువారం దాడులు చేశారు. అప్పోజిపేటలో 800 పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్‌శాఖ సిఐ మీరా సాహెబ్ తెలిపారు. సవరమర్రిపాడుకు చెందిన వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందజేయాలని సూచించారు. నాటుసారా తయారీదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టెక్కలి, కోటబొమ్మాళి ఎస్‌ఐలు వేణు, గురుమూర్తి, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- పాతపట్నం

బెల్ట్ సాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు పాతపట్నం ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని వాహనాలను తనిఖీ చేశారు. సరిహద్దు ప్రాంతంలో ముమ్మరంగా



వాహనాలను తనిఖీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

వాహనాలను తనిఖీ చేయాలన్నారు. నాటుసారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి వాటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.వి.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

క్రీడాకారునికి అభినందనలు

ఇచ్ఛాపురం: జాతీయస్థాయి పోటీలో పాల్గొని ఇచ్ఛాపురానికి మెడల్ రావడం శుభపరిణామమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. జాతీయస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో బ్రాంచ్ మెడల్ సాధించిన విద్యార్థిని నీలాపు భగవాన్‌కు స్థానిక తైక్వాండో క్లాస్ ఆవరణలో వార్డు కౌన్సిలర్ పిలక విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నంబరు 7న నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌జిఎఫ్‌ఐ స్కూల్ గేమ్స్‌లో అండర్-51 కేజీ కేటగిరి నీలాపు భగవాన్ బ్రాంచ్ మెడల్ సాధించారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంతి ఆర్మీ అధికారి దక్కత సుమన్‌రెడ్డి, వైద్యులు వెచ్చా సంతోష్, వార్డు కౌన్సిలర్లు ఎస్.ప్రేమ్‌కుమార్, కాళ్ల దిలీప్‌కుమార్, చాట్ల తిరుపతి, క్రీడాకారుడు బత్తిన కృష్ణయ్య, వ్యాపార వేత్తలు చిన్నారు మధు, వల్లంపాటి శ్రీరామ్, శాసనపురి ప్రదీప్, ఈచ్ ఎం.జోగేష్, ఆసి లతా పాల్గొన్నారు.

కేసులపై కక్షిదారులకు అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగానికి, ఎక్కువ కేసులు రాజీకి న్యాయవాదులు కృషి చేయాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి కోరారు. కోర్టు హాల్‌లో బార్ అసోసియేషన్ పరిధిలో న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి రాజీకి యత్నించే విధంగా కక్షిదారుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు



మాట్లాడుతున్న జడ్జి తేజచక్రవర్తి

దివ్వల వివేకానంద, ఎజిపి గురువెల్లి కృష్ణారావు, ఎపిపి పి.రమేష్, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, పైల చంద్రుడు, వైకుంఠరావు పాణిగ్రాహి, సాయిరాజ్, పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, రెయ్యి భువనచంద్ర పాల్గొన్నారు.

పశుగ్రాసాల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- పొందూరు

పశుసంవర్ధక శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ ద్వారా బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. కింతలిలో గురువారం పశుగ్రాసాల సాగుపై విలేకర్లతో మాట్లాడారు. కన్వర్జన్సీ పద్ధతిలో పశుగ్రాసాల సాగుకు ఏడాది పాటు ఖర్చులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగు కోసం



శ్రీనివాసరావు

విత్తనాలు, పిలకలు తెలిసిన పాడిరైతుల వద్ద, పశువైద్యాధికారి సూచించిన అమ్మకం దారుల వద్ద కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. ఈ సాగుకు ఏడాదికి 10 సెంట్లు విస్తీర్ణంలో రూ.6,599, 20 సెంట్లుకు రూ.13,197, 30 సెంట్లుకు రూ.19,795, 40 సెంట్లుకు రూ.26,394, 50 సెంట్లుకు రూ.32,992 ప్రభుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. అర్హత గల పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని జెఆర్ పురం సిఐ అవతారం హెచ్చరించారు. రణస్థలం మండలం కోష్ట జంక్షన్‌లో గురువారం ఆటో డ్రైవర్లు, దుకాణదారులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. దుకాణదారులు రోడ్డుపైకి రాకుండా వ్యాపారం చేసుకోవాలని, దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఐదు రోడ్ల కూడలి కావడంతో ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సూచనలు చేస్తున్న సిఐ అవతారం

ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌పై కూలీల ఫిర్యాదు



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- సోంపేట

ఉపాధి హామీ కూలీల నుంచి డబ్బులు వసూలు చేయడం, పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై, మేట్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కూలీలు కోరారు. మండలంలోని కొర్లాంలో ఎపిఎం బి.ప్రమీల అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ మేరకు కూలీలు పలు ఫిర్యాదులు చేశారు. వారానికి రూ.వంద చొప్పున మేట్లు వసూలు చేస్తున్నారని అన్నారు. పనిచేయని వారి బిల్లులను విత్ డ్రా చేసి జేబులో వేసుకుంటున్నారని విమర్శించారు. చెరువుల్లో కంకర మట్టి అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌పి చిన్నబ్బాయి, ఎస్ఆర్‌పి రామారావు, ఉప సర్పంచ్ వాసుదేవరావు, ఎంపిటిసి లైలావతి పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ప్రయత్నం అభినందనీయం

ప్రజాశకి- కవిటి

గ్యాస్ వినియోగం, వాడకంపై భారత్ గ్యాస్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు ఉన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చింతామణి భారత్ గ్యాస్ ఆధ్వర్యాన గురువారం మన వంటగది - మన బాధ్యత అంటూ గ్యాస్ వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం చింతామణి భారత్ గ్యాస్ యజమాని కొండేటి వెంకటరావు మాట్లాడుతూ ఎల్‌పిజి గ్యాస్



బహుమతులు అందజేస్తున్న గ్యాస్ యాజమాన్యం

వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్యాస్ సిబ్బంది శంకర్, గవ్వల భాగ్యం, దుద్ది మణి, శార్వాణి, శేఖర్, దేవరాజు, కామరాజు, జగదీష్, మాధవరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌కు రిమ్స్ విద్యార్థిని



రమ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటాచలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ స్థాయిలో డిశంబరు 5 నుంచి 10 వరకు కేరళ రాష్ట్రం కోయంబత్తూరులో జరగనున్న రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మూడో ఏడాది విద్యార్థిని ఆర్.వి.రమ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా.రావి వెంకటాచలం తెలిపారు. ఎపి తరపున ఆమె ఆ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ వైద్య కళాశాలలో ఆమెను అభినందించారు. ఈనెల 11, 13తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 36వ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆల్‌పైన్ విభాగంలో గోల్డ్‌మెడల్, డౌన్‌హిల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం అభినందనీయమని స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ పరశురాం, కార్యదర్శి డాక్టర్ సనపల నర్సింహమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.గౌరునాయుడులు పేర్కొన్నారు.

సంఘాల వివరాలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బ్యాంకు లింకేజీ రుణాలకు ఈ నెల 30 నాటికి అర్హత కలిగిన సంఘాలు వివరాలు సిద్ధం చేయాలని వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో సర్వే చేసి శక్తి సంఘాల సభ్యుల ఆదాయ వివరాలు, గతంలో వారు పొందిన రుణాలతో చేపట్టే కార్యక్రమాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యాచరణ ప్రణాళిక ప్రకారం తయారు చేసి డాక్యుమెంట్లు బ్యాంకు అందజేయాలన్నారు. ఎన్‌పిసిఎల్ కుటుంబంలో బ్యాంకు ఖాతాలు కలిగిన సభ్యులకు వారి అకౌంట్‌కు ఎంపిసిఐ లింకు అయ్యిందీ, లేనది సరి చూడాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఎల్.సుశీల, సిసిలు మోహనరావు, లక్ష్మి, అకౌంటెంట్ మోహిని, విఒఎలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డు డేకురకొండ సమీపంలో ఉన్న హట్కో కాలనీ వాసులకు ఎకరా స్థలం శ్మశాన వాటిక ఉంది. శ్మశాన వాటిక ప్రాంతం అధ్వానంగా ఉండడంతో నిత్యం ఆ ప్రాంత వాసులు దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని తీర్మానించారు. 30 వార్డు కౌన్సిలర్ డొక్కరి తులసి, ఆయన భర్త, టిడిపి నాయకులు డొక్కరి శంకర్ శ్మశాన వాటిక అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చారు. తనవంతుగా రూ.10 లక్షలు కేటాయించి పనులను గురువారం ప్రారంభించారు. శ్మశాన వాటిక వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు.



శంకర్‌తో స్థానిక యువకులు




సన్మానిస్తున్న సంఘ నాయకులు

లక్ష్మణ్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- పలాస

టిడిపి మండల అధ్యక్షుడు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్‌కు మాకన్నపల్లి అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. అగ్నికుల క్షత్రియలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుత్తుం మాధవరావు, కుత్తుం ధర్మారావు, బత్తిన వీరాస్వామి, తెప్పల భీమారావు, కుత్తుం వినోద్, తెప్పల లోకు, జనసేన అధ్యక్షులు పోలయ్య పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఢిల్లీరావు

జానపద కళా జాతరకు విరాళం

ప్రజాశక్తి- పలాస

వజ్రపుకొత్తూరు మండలం రాజాంంలో జనవరి 12న నిర్వహించనున్న సిక్కోలు జానపద కళాజాతర కార్యక్రమానికి మండలంలోని బొడ్డపాడుకు చెందిన జెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ కిక్కిర ఢిల్లీరావు రూ.5,500లు విరాళం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సిక్కోలు జానపద కళాజాతరకూ ఆర్థికసాయం అందజేశామని తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తాను ఆర్థిక సాయం అందజేస్తున్నాని చెప్పారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్యం అధ్యక్షులు రాపాక ధనరాజు, మామిడి కృష్ణారావు, దున్న రామారావు మాస్టర్, కుత్తుం వినోద్, మడియ వాసు, సార జోగారావు, గుర్తం తులసీరావు, ఎన్.గంగాధర్, రెయ్యి పాపారావు, బొడ్డు జగన్, పోతనపల్లి చిరంజీవి పాల్గొన్నారు.


భాస్కర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వెంకటరమణ

'కలమట'ను కలిసిన భాస్కర్‌గౌడ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణని ఇటీవల నియమితులైన గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు భాస్కర్‌గౌడ్‌ను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ సిలార్, ఎల్లంనాయుడు, పోలినాయుడు, వీరన్న, ధనంజయ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ చిరంజీవి

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పర్చుకుని ఉన్నత స్థాయికి చేరాలని జెఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సూచించారు. కొండములగాం మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనేక రంగాల్లో రాణించాల్సిన యువత మద్యం మత్తులో జీవితాన్ని నాశనం చేసుకుంటోందన్నారు. సమాజాభివృద్ధిలో విద్యార్థులే కీలకమని. విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా పోలీస్ బి.అమ్మోజీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని ప్రముఖ లేప్రోస్కోపిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలన్నారు. గ్రంథాలయానికి వచ్చిన ముగ్గురు పేద విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున ప్రతి ఏడాది అందజేస్తానని డాక్టర్ శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాణ వేణుగోపాల్, రొక్కం భాస్కరరావు, బాలకథానిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

26న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- రణస్థలం

శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రణస్థలం కళ్యాణి కంటి పరీక్షా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 26న మండల కేంద్రంలో ఉన్న కళ్యాణి కంటి పరీక్షా కేంద్రం ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కళ్యాణి కంటి పరీక్షా కేంద్రం అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని నేత్ర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు ఎంపికైన వారికి కాటరాక్ట్ శస్త్రచికిత్స (లెన్సు) అమర్చి ఉచితంగా ఆపరేషన్ చేయబడునన్నారు. అలాగే కంటి మీద కండ, మెల్లకన్ను సరిచేయుట, కంటి శుక్లాలు ఉన్న పెద్దలకు, పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారన్నారు. ఈ నేత్ర శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఫోన్ నెంబరు, రెండు జతల బట్టలు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

స్థలం మంజూరు చేయాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని రాజుపేట గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మం ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌ను ఆయన స్వగృహంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరుకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీఇచ్చారు.

హోమియో వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి - పాతపట్నం

హోమియో మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని తెంబూరు హోమియో వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి తెలిపారు. గంగువాడ పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శివ, డాక్టర్ పూర్ణిమ ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా ఆయుర్వేద, హోమియో మందులు ఉన్నాయని తెలియజేవారు. గ్రామీణ ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పద్మ, దివ్య, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హోమియో వైద్యులు ఉమాగౌరి

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం సిఐ వి.రామారావు అన్నారు. మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారుర. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు సంభవిస్తే 1930 నంబరుకు ఫోన్ చేస్తే రికవరీ చేస్తామని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేనిచో అనవసరంగా కేసులో ఇరుక్కుని భవిష్యత్ పాడు చేసుకుంటారని అన్నారు. వాటి వినియోగం వల్ల అనారోగ్యానికి పాలై జీవితాన్ని నాశనం చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎఎస్ఐ నర్సింగరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ మీసాల చిన్నంనాయుడు సూచించారు. మండలం లోని హరిపురంలో గురువారం అవగాహన కల్పించారు. ఎవరికీ ఎటిఎం పిన్ కోడ్, అకౌంట్ నంబరు ఇవ్వరాదన్నారు. మహిళలను వేధింపులకు గురిస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

మండల ప్రత్యేక అధికారి కరుణాకరరావు

ప్రజాశక్తి- పాతపట్నం

పుట్టిన ధ్రువపత్రాలు ఏ విద్యార్థి దగ్గరైనా లేకపోతే ఆన్‌లైన్ ద్వారా స్కూల్‌లోని వివరాల ప్రకారం నమోదు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి సూచించారు. మండలంలో పాతపట్నం సెంటెన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసి ఆధార్ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి ఆధార్ కార్డులు, విద్యార్థి సమాచారాన్ని ఆధార్ కేంద్రాలకు తీసుకువెళ్లాలని కోరారు. మండలంలో 12,707 విద్యార్థులు ఉండగా, వారిలో 9,017 మందికి అపార్ ఐడిలు తయారైనట్లు తెలిపారు. మిగిలిన వారిలో 1391 విద్యార్థులకు పుట్టిన ధ్రువపత్రాలు లేవని చెప్పారు. 155 మంది విద్యార్థులు నాన అవైలబిలిటీ ధ్రువపత్రాల కోసం నమోదు చేశారని అన్నారు. 107 మంది ఆధార్‌లో తప్పులు సవరించడానికి నమోదు చేశామన్నారు. 55 మంది విద్యార్థులు లేట్ రిజిస్ట్రేషన్‌కు నమోదు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, స్కూల్ ప్రిన్సిపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కరుణాకరరావు

అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పోలాకి: అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు వల్లివేయడం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి తగదని డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, అన్నారు. మండలంలోని వెదుల్లవలసలో కరిమి రాజేశ్వరరావు ఇంటి వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. నరసన్నపేటలో వంద పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ చొరవతో నరసన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఇసుకసురుల రాజ్యం కూటమి ఎమ్మెల్యే నేతృత్వంలోనే జరుగుతుందని ఆరోపించారు. గోపాల పెంట ఇసుక ర్యాంపు నుంచి ఎమ్మెల్యే బంధువులే రాత్రికి రాత్రి వందలకొద్దీ ఇసుక లారీలు అక్రమంగా దోచుకు పోతున్నారని ఆరోపించారు. మద్యం సిండికేట్ వ్యాపారం, బెల్ట్ షాపులు నిర్వహణ ఎమ్మెల్యే బంధువులు వదలడం లేదని విమర్శించారు. వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, తూలుగు అశోక్ కుమార్, కె.తాతారావు, కె.సత్తిబాబు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఫాసిజాన్ని అడ్డుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

భారతదేశం ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని, దీనిని అడ్డుకోవడమే తక్షణ కర్తవ్యమని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రిపాడులో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షత శ్రీకాకుళ అమరుల 46వ స్మారక సభ గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడోసారి బిజెపి అధికారంలోకి వచ్చాక దేశానికి ఫాసిస్టు ప్రమాదం పొంచి ఉందన్నారు. మతోన్మాదాన్ని విద్వేషాలను రెచ్చగొట్టడం సంఘ పరివార్ అజెండాను యథావిధిగా ప్రధాని అమలు చేస్తున్నారని విమర్శించారు. ముస్లిములను, క్రైస్తవులను, కమ్యూనిస్టులను అంతర్గత శత్రువులుగా, అణచివేయడమే వీరు లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. అందులో భాగమే దక్షిణాదిలో మత విద్వేషాలు రెచ్చగొట్టి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో తిరుపతి లడ్డు చుట్టూ రాజకీయాలు చేశారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం నక్సల్ బరి శ్రీకాకుళ ఉద్యమాలు ముందుకొచ్చాయని, ఈ ఉద్యమాల్లో ఎంతో మంది డాక్టర్లు, న్యాయవాదులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం అమరుడు మురిపిండి వల్లభరావు జీవిత సహచరిని ఎరకమ్మ అమరుల స్థూపంపై పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, పిడిఎఫ్‌యు ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు, సవర బంగ్లాకుమార్, మురిపింటి తాతారావు, రాపాక చంద్రయ్య పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వరిసాం పంచాయతీ అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ఎంఎస్‌సి చదివిన విద్యార్థులకు 'ఫార్మాసిటీకాల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్' పై ఆరు నెలల శిక్షణ అందించారు. ఈ శిక్షణా కాలం ముగిసిన సందర్భంగా 11వ బ్యాచ్‌కు చెందిన 25 మంది విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్పొరేట్ హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ యు.ఎన్.బి.రాజు మాట్లాడుతూ ఆరు నెలల శిక్షణలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే, అధునాతన యంత్రాలతో ఫార్మా అండ్ కెమికల్స్‌కు అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ వలన వివిధ ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ రమా శ్రీనివాస్, కమలాకర్ రెడ్డి చేతులమీదుగా సర్టిఫికేట్లు అందించారు. కార్యక్రమంలో అపిటోరియా ఫార్మా, అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఉద్యోగులు, శిక్షణ అందించిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికేట్లతో విద్యార్థులు

విద్యార్థులకు పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- కవిటి

విశాఖపట్నం ఎంవిపి కాలనీకి చెందిన జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్టు బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సెట్ల మోడల్ పేపర్లు ఉచితంగా గురువారం అందించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ జుత్తు సింహాచలం మాట్లాడుతూ జగ్గన్న మెమోరియల్ ట్రస్టు ద్వారా జిల్లాలో 20 మండలాల్లోని ఉన్నత పాఠశాలకు రూ.7 లక్షలు విలువ చేసే 2,800 సెట్ల మోడల్ పేపర్లను పుస్తకాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తీర గ్రామాల్లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువ తీర ప్రాంత గ్రామాల్లో మెరైన్ సిఐ రమేష్ కుమార్ ఆధ్వర్యాన గురువారం డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగర కవచ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు పాటు గ్రామాల్లో మెరైన్ సిబ్బంది, సివిల్ పోలీసులు, ఇండియన్ నేవీ సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు, బయట నుంచి వచ్చే చొరబాటుదారులు గ్రామాల్లో ప్రవేశిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు, సోంపేట సిఐ మంగరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

29న 'చలో శ్రీకాకుళం'

కోటబొమ్మాళి: ఎస్‌సి రిజర్వేషన్లు, దాడులకు నిరసనగా ఈ నెల 29న చలో శ్రీకాకుళం సభ, ర్యాలీ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎస్‌సి రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సంఘం సభ్యులు సామ సంజీవరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పలువురు సంఘ నాయకులతో కలిసి మండల పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. దళిత నాయకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈయనతో పాటు దళిత సంఘ నాయకులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

తాబేళ్ల సంరక్షణపై అవగాహన

సోంపేట: మండలంలోని కొత్తూరులో అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యాన సముద్ర తాబేల సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. మత్స్యకారుల వలలో సముద్ర తాబేలు పడితే వాటిని ఎలా బయటకు తీయాలి, తిరిగి సముద్రంలో ఎలా విడిచి పెట్టాలి అన్న అంశాలను తెలియజేశారు. అలాగే తాబేలు పొదిగే కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బిఎస్వోలు, రామకృష్ణ, రాఘవయ్య, రవి కుమార్, సంతోష్, పోలయ్య, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో సస్యరక్షణ

కోటబొమ్మాళి: గత 14 వారాలుగా పొలంబడి కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించి ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించామని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు. మండలంలోని ఎత్తురాళ్లపాడులో మండల ఎఒ ఎస్.గోవిందరావు ఆధ్వర్యాన గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు సనపల గుర్రయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అసిరిపోలమ్మ ఆలయం ప్రారంభం

కవిటి : మండలంలోని తుంగానపుట్టుగలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత అసిరిపోలమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం ప్రారంభించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని తయారు చేసిన బొరివంకకు చెందిన శిల్పి భైరి తిరుపతిని వైద్యులు రామకృష్ణ, వెంకటేశం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతం కళలకు పుట్టినిల్లు అని, అందులో శిల్పి తిరుపతి తన ప్రావీణ్యంతో ఉద్దానం ఖ్యాతి ఇనుమడింపజేస్తున్నారని అన్నారు.

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

డిసెంబరు 10న మానవహక్కుల దినోత్సవం సందర్భంగా చలో విజయవాడ నిర్వహిస్తున్నామని ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు తెలిపారు. సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులపై నమోదు చేసిన అక్రమ కేసులు రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లో ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం ఉన్న సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిల్లల ఫాల్గుణరావు, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు


ప్రారంభిస్తున్న సర్పంచ్ చిరంజీవి

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి వేదికగా సామాజిక భవనాన్ని ఉపయోగించుకోవాలని కంబాలరాయుడపేట సర్పంచ్ వంక చిరంజీవి కోర్రారు. ఈ మేరకు గ్రామంలో సాగరమిత్ర సామాజిక భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాయితీపైన వలలు, బోట్లు అందించాలని కోరారు. మత్స్యకార భరోసాను అర్హుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సాగర మత్స్య సహకార సంఘ అధ్యక్షులు మూగి జంగమయ్య, మాజీ సర్పంచ్ కంబాల దానేష్, ఎంపిటిసి కారి వెంకటరావు, మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి కొండ నాగరాజు, సాగరమిత్ర అంబటి జానకిరామ్ పాల్గొన్నారు.

పార్కులో సౌకర్యాల కల్పనపై వినతి

ప్రజాశక్తి- పలాస

పలాసలోని ముత్యాలమ్మ కోనేరు నెహ్రూ పార్కులో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జి.రాజేంద్ర నాయుడు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో సాయంత్రం పూట వాకింగ్ చేసుకోవడానికి వీలుగా లైటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. పార్కుకు ఆనుకొని ఉన్న కెటి రోడ్డు పక్కన అనేక ఫాస్టు ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేశారని, దీనివల్ల వాకర్స్ తమ వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలలో సభ్యులు దడియాల నరసింహులు, లండ నాగరాజు, బి.శంకరరావు, ఎస్.వసంత, సంతోష్‌పాత్రో, బోనెల భైరాగి, సత్యనారాయణ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వాకర్సు


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న సత్యనారాయణ

పంటకోత ప్రయోగాలు


ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కుంటిభద్ర, మాకవరం గ్రామాల్లో ఎంటి సత్యనారాయణ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సేద్యం చేస్తున్న వరి పంటలో గురువారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పొలాల్లో రైతులు గత నాలుగేళ్లుగా నవధాన్యాలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పంట కోత ప్రయోగం రసాయన వ్యవసాయనికి, ప్రకృతి వ్యవసాయనికి మధ్య దిగుబడులు తేడా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి ఎ.నాగేశ్వర రావు, వివిఎలు రాంబాబు, పవన్, యూనిట్ ఇన్‌ఛార్జిలు పెంటయ్య, గోవింద్, జనార్ధన్, రవి, చిన్నమ్మి, ఐసిఆర్‌పిలు ధనలక్ష్మి, వెంకటరావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని తెంబూరు పంచాయతీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులను మాజీ సర్పంచ్ బమ్మిడి సింహాచలం, కాకర్ల మల్లేశ్వరరావు, వెంకటరమణ గురువారం ప్రారంభించారు. గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనులకు నిధులు విడుదల చేస్తుందన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎఇ యోగి, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయరాజు, కాంట్రాక్టు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు


కలెక్టర్‌ను కలిసిన యూనియన్ బ్యాంకు అధికారులు

యుబిఐ సేవలు ప్రశంసనీయం

శ్రీకాకుళం అర్బన్ : సామాజిక బాధ్యతగా సిఎస్ఆర్ ద్వారా రూ.70 లక్షల వ్యయంతో జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. గురువారం తన ఛాంబర్‌లో కలిసిన బ్యాంకు అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అందిస్తున్న సహకారాన్ని వారు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల కోసం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రూ.33 లక్షలతో అత్యాధునిక లైబ్రరీ భవన నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. అలాగే జిల్లాలో 10 గ్రామ సచివాలయాలకు సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బ్లడ్ ప్యాకెట్లు నిల్వ చేసేందుకు రూ.10.50 లక్షలతో రెండు ఫ్రీజర్లు అందజేశామన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు ఇచ్చినట్టు వివరించారు. వృద్ధులు సేదతీరేందుకు వీలుగా నాగావళి నది ఒడ్డున దత్తాత్రేయ ఆలయ ప్రాంగణంలో బెంచీలను అమర్చామని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రీజనల్ హెడ్ ఎం.వెంకట తిలక్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి సిరిపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మండలం ఆనందపురం, దవలపేట, ఆబోతుల పేట, మెట్టవలస, మర్రివలస, పాలఖండ్యాం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఐటి హబ్ ఏర్పాటు చేయాలి

లావేరు : ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఐటి హబ్ ఏర్పాటు చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ మాట్లాడారు. ఎచ్చెర్లలో ట్రిపుల్ ఐటి, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉన్నాయని, ఇక్కడకు 20 కిలోమీటర్ల దూరంలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులో ఉందన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న ఎచ్చెర్లలో ఐటి హబ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ దీనిని పరిగణనలోకి తీసుకొని ఐటి హబ్ ఏర్పాటుకు కృషి చేస్తామని సభలో తెలిపారు.

ఉత్తర్వులు నిలుపుదల చేయాలి

పొందూరు: రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత పాఠశాలల పని వేళలను పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విధంగా పని వేళలు పెంచడం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇప్పుడు ఉన్న పనివేళలు కొనసాగిస్తూనే, మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఒక సబ్జెక్టు చొప్పున స్టడీఅవర్‌లను పెట్టడం మంచిదని భావిస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాలల పనివేళల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.